
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అమరావతి: మండల పరిధిలోని మల్లాది సమీపంలో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను అమరావతి పోలీసులు సీజ్ చేశారు.



కానుకలు లెక్కింపు

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం 4 నెలల హుండీ ఆదాయం రూ. 37,713 వచ్చినట్లు తెలిపారు.



పిడుగురాళ్లలో భారీ వర్షం

పిడుగురాళ్ల: పట్టణంలో గురువారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ కాయగా.. సాయంత్రం 5 గంటలకు వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

పచ్చ బ్యాచ్ పాగా!

మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు తమకు అదృష్టం కలిసి వచ్చిందో లేదంటే కోరికోరి చిక్కుల్లో పడ్డామో అర్థం కాని పరిస్థితి. అధికార పార్టీ నేతల తీరుతో వారు తలలు పట్టుకుంటున్నారు. కేవలం లక్ ఉంటే సరిపోదు... మాకు కమీషన్ల కిక్కు కూడా ఇవ్వాలని టీడీపీ నేతల బెదిరింపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి వ్యాపారులకు సహకారం లేకపోవడంతో ఎమ్మెల్యేలు అడిగినంత ఇచ్చుకొని దుకాణాలు తెరిచేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇంకా సయోధ్య కుదరకపోవడంతో రెండవ రోజైన గురువారం కూడా సగానికిపైగా మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదు.



- కూటమి నేతల చేతుల్లోకి మద్యం దుకాణాలు
- కొనసాగుతున్న టీడీపీ నేతల బెదిరింపులు
- కమీషన్లు ఇస్తేనే దుకాణాలు తెరిచే అవకాశం
- జిల్లాలో సగానికిపైగా తెరుచుకోని దుకాణాలు
- వ్యాపారులకు రక్షణలో ప్రభుత్వం బిల్డప్పులు
- పూర్తిగా చేతులెత్తేసిన ఎక్సైజ్ అధికారులు
- గత్యంతరం లేక తలొగ్గుతున్న వ్యాపారులు

నరసరావుపేట టౌన్: ప్రభుత్వ మద్యం దుకాణాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పూర్తిగా టీడీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. లాటరీలో దుకాణాలు పొందిన వారిపై సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి తమ దారికి తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేలు నేరుగా ఈ వ్యవహారంలో రంగంలోకి దిగడంతో వ్యాపారులకు మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. వారు చెప్పినంత ఇవ్వడం, చెప్పినట్లు వినడమే తప్ప మరో మార్గం కనిపించలేదు. ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం వ్యాపారుల జోలికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల ఆగడాలకు అద్దూ అదుపు లేకుండా పోయింది. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో మద్యం వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయ మార్గంపై కన్నేసిన ఎమ్మెల్యేలు ఎలాగైనా దుకాణాలు సొంతం చేసుకోవాలని భావిస్తున్నారు. వ్యాపారులను బెదిరించి, వేధిచి తమ పరం చేసుకుంటున్నారు. ఈ సారి ఎన్నికల్లో టిక్కెట్టు కూడా ఇవ్వరనే అభిప్రాయానికి వచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఏకంగా వచ్చిన కాడికి దండుకునేందుకు సిద్ధమయ్యారు.

మద్యం ధరలపై నిరసన

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అతి తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొస్తామని టీడీపీ హామీలు గుప్పించింది. వీటిని నమ్మిన మందుబాబులు ఇప్పుడు దుకాణాల వద్దకు వెళ్తే పాత బ్రాండ్ల వాసనలు, పాత ధరలే స్వాగతం పలుకుతున్నాయి. దీంతో ప్రభుత్వంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులపై ఎస్పీ సీరియస్..

మద్యం వ్యాపారుల పంచాయతీలో పోలీసుల జోక్యంపై పత్రికల్లో రావడంతో జిల్లా ఎస్పీ స్థానిక పోలీసు అధికారులను చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. రాజకీయ వేధింపుల వ్యవహారంలో జోక్యం చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోమారు ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకుంటే చర్యలు తప్పవని పట్టణ పోలీసు అధికారులను మందలించినట్టు తెలియవచ్చింది.

కొనసాగుతున్న వేధింపులు..

నరసరావుపేటతోపాటు పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో కూ డా మద్యం వ్యాపారులకు అధికారపార్టీ నుంచి వేధింపులు తప్పడం లేదు. తమ మాట వినని వ్యాపారులపై పోలీసు జులుం ప్రయోగిస్తున్నారు. ఎమ్మెల్యే మాట వినలేదని పిడుగురాళ్లలో ఒక వ్యాపారిని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. సత్తెనపల్లిలో ప్రజాప్రతినిధి కుమారుడికి ఒక్కో షాపుకు రూ.30 లక్షలు చెల్లించిన తరువాతే దుకాణాలు ప్రారంభమయ్యాయి. వినుకొండలో ప్రజాప్రతినిధి చెప్పిన విధంగా 50 శాతం వాటా ఇచ్చేందుకు వ్యాపారులు సిద్ధపడ్డారు. దీంతో ఇక్కడ దుకాణాలు తెరిచేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. పెదకూరపాడు, మాచర్ల, చిలకలూరిపేటల్లో టీడీపీ నాయకులు సిండికేట్‌తో కలిసి వ్యాపారం చేసేవిధంగా లైసెన్సుదారులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

తేలని పేట పంచాయితీ...

నరసరావుపేట నియోజకవర్గంలో మద్యం దుకాణాల పంచాయితీ ఇంకా కొలిక్కి రాలేదు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారుల సిండికేట్ స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గడం లేదు. మద్యం వ్యాపారులకు చెందిన బార్లపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో వేధింపులకు దిగారు. అయినా ఎమ్మెల్యే వద్దకు చర్చల నిమిత్తం వ్యాపారులు రాకపోవడంతో నరసరావుపేటలోని మద్యం దుకాణాల పంచాయతీ నిలిచిపోయింది. దీంతో నియోజకవర్గంలోని 17 దుకాణాల్లో నామమాత్రంగా నాలుగు మాత్రమే ప్రారంభమయ్యాయి. టీడీపీలోని బలమైన ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు గ్రూపులు పోటీ పడుతున్నాయి. లాటరీలో మద్యం వ్యాపారుల సిండికేట్‌కు అధికంగా 8 దుకాణాలు దక్కాయి. ఈ దుకాణాల్లో రెండో వర్గానికి కూడా వాటాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వర్గం డిమాండ్ చేస్తుంది. దీనికి మద్యం వ్యాపారుల సిండికేట్ సుముఖంగా లేదు. లాటరీ దక్కిన విధంగా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు వారు సిద్ధమవుతున్నారు. దీంతో ఈ వ్యవహారం ఎక్కడకు దారి తీస్తోందో వేచి చూడాలి.



ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు అథ్లెటిక్స్ అంశాల్లో క్రీడాకారులు పోటీ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మరి కొంతమంది ఏపీ అథ్లెట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు.

ఆలపాటికి ఆమోదం ఏదీ!

- స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటయ్యేనా?
- పార్టీ అనుమతి లేని సమావేశాలు కుదరవన్న నేతలు
- కూటమితో సంప్రదింపులు లేకుండానే అభ్యర్థి ఎలా?
- నివేదికల తరువాతే ఖరారంటూ టీడీపీ బుజ్జగింపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై కూటమిలో తకరారు
- అన్నింటా వారేనా అంటున్న ఇతర సామాజిక వర్గాలు



సాక్షి, విజయవాడ: ముందడుగు మనదైతే అధిష్టానం ముందరి కాళ్లకు బంధం వేయవచ్చన్న వ్యూహంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేస్తున్న అడుగులు ఆయన రాజకీయానికి చేటు తెచ్చేలా ఉన్నాయి. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు... అన్న చందాన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని తానేనంటూ చేసుకుంటున్న స్వీయ ప్రచారాన్ని కూటమి వర్గాలు తప్పుపడుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆలపాటి తీరును కూటమి పక్షాల సంగతి అటుంచి స్వపక్షంలోని సీనియర్లతో సహా ఆ పార్టీకి చెందిన విభిన్న సామాజికవర్గాల వారు అంతర్గతంగా వ్యతిరేకిస్తున్నారు. స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటు కాదని, పార్టీ ముఖ్య నాయకులు, నిఘా వర్గాల సమాచారాన్ని సమీక్షించుకున్న తరువాతే అభ్యర్థి ఎవరనే స్పష్టత వస్తుందని టీడీపీ అధిష్టానం కూటమిలోని జనసేన, బీజేపీ ముఖ్యులకు సమాచారం పంపిందని వినికిడి. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన ఆలపాటికి గత ఎన్నికల్లో తెనాలి నుంచి టీడీపీ టిక్కెట్టు దక్కకపోవడంతో ఏదో ఒక ముఖ్య పదవి ఆశిస్తున్న నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవకాశంగా అనిపించింది. పార్టీ పనిలో భాగంగా పట్టభద్రుల ఓటర్ల చేరిక తదితరాలను చూడాలని అధిష్టానం సూచించిందని, తననే అభ్యర్థిగా పోటీలో నిలుపుతారనే ప్రచారాన్ని ఆలపాటి చేసుకుంటున్నారని, అంతకుమించి అధిష్టానం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా, సూచనలు చేయలేదని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సీనియర్లు గుర్తు చేస్తున్నారు. అధిష్టానం చెప్పకుండా ఆయన కోసం తాము నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఎలా నిర్వహిస్తామని ప్రస్తుత గుంటూరు జిల్లాలోని ఓ శాసనసభ్యుడు ప్రశ్నించడంతో ఆలపాటి వర్గీయులు వెనుతిరిగారనేది సమాచారం. ప్రస్తుత గుంటూరు జిల్లా నుంచి ఒకే సామాజిక వర్గానికి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌లు ఉండగా మళ్లీ అదే సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి ఎలా నిలుపుతారని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులు అభిప్రాయపడుతుండటం పరిశీలనాంశం. 'ఎలాంటి హోదా, అధికారం లేకుండానే ఆయన పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారుల పోస్టింగ్‌లు తనకు అనుకూలంగా ఉండాలని గట్టి పైరవీలు చేశారు. పోలీసులు, మునిసిపల్ అధికారులకు హుకుం జారీ చేస్తూ పనులు చేయాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. అలాంటి ఆయనకు పదవి కూడా సమకూరితే నియోజకవర్గంలో మేమేం చేయాలి' అని కూటమిలోని ముఖ్య నేత వద్ద ఓ ప్రజాప్రతినిధి ప్రస్తావించినట్లు తెలిసింది. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం గురించి సంప్రదించారా, అలాంటివి ఏమీ లేకుండానే నిర్ణయం జరిగిపోయినట్లు ప్రచారం ఎలా చేసుకుంటారని కూడా అడిగారనేది సమాచారం.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్న వారి సంఖ్య కూటమి పార్టీల నుంచి ఎక్కువగానే ఉంది. ఎవరంతట వారు ప్రయత్నాలు అంతర్గతంగా చేసుకుంటున్నారని తెలిసింది. కాగా ఆలపాటి అన్ని మార్గాల్లోనూ ప్రచారం వేగవంతం చేస్తుండటాన్ని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కట్టడి చేయాలని, లేదా ఏదో ఒక స్పష్టత ఇవ్వాలని కూటమి నేతలు కోరనున్నట్లు తెలిసింది.

ఆలపాటికి సహకారం అనుమానమే..

ఆలపాటిని రాజకీయంగా బాహాటంగా వ్యతిరేకించే సీనియర్లు ఉమ్మడి గుంటూరులో పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ఇరుగుపొరుగు నియోజకవర్గాలలో జోక్యం చేసుకుంటూ ఇబ్బందులు పెడుతుంటారనే ఆరోపణలు ఆలపాటిపై లేకపోలేదు. తెనాలి సీటు ఇవ్వలేని పక్షంలో తనకు మరోచోట అయినా ఇవ్వాలంటూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోని నియోజకవర్గాలపై ఆయన దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఆయా నియోజకవర్గాలకు చెందిన వారు ఆలపాటికి రేపటి ఎన్నికల్లో సహకరిస్తారా అనే అనుమానాలు కూడా అధిష్టానంలో ఉన్నాయని గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు అభిప్రాయపడటం పరిశీలనాంశం. 'మా బాబు గారి సంగతి తెలియంది ఏముంది. ముందుగా ప్రచారానికి ఒక రాయి విసురుతారు. తను ఇవ్వాలనుకుంటే ఇస్తారు. లేదంటే నీపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. నివేదికలు భిన్నంగా ఉన్నాయి కుదరదు అంటారు' అని ముక్తాయించారు.

ఏఎన్‌యూ పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఏపీపీజీసెట్- 2024లో ర్యాంకులు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం



నరసరావుపేట: రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం వాల్మీకి కుల సంఘాల నాయకుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాల్మీకి బోయ కమ్యూనిటీ సభ్యులు కూడా ప్రసంగించారు. డీఆర్వో కె.వినాయకం, వాల్మీకి సంఘ నాయకులు, పలువురు జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఖాయం



పిడుగురాళ్ల: ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని పల్నాడు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాబా రాజు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదన్నారు. ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేసినా పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు. 17 సంవత్సరాల సర్వీసును పరిగణనలోకి తీసుకొని కాంట్రాక్ట్‌లో క్యాడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన సిబ్బందికి రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. పదవీ విరమణ పొందితే రూ. 10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతి వర్మకు పతకం



మంగళగిరి: గోవాలో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ , ఉమెన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన పవర్ లిఫ్టర్ పి. జ్యోతి వర్మ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు గురువారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, సంధాని తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో నేషనల్ స్థాయిలో మాస్టర్ 2ప్లస్ 50 ఇయర్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి పవర్ లిఫ్టర్ జ్యోతి వర్మని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంట వెంకటేశ్వరరావు, కార్యదర్శి సకల సూర్యనారాయణతో పాటు ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

నృసింహ స్వామికి రూ. 45.51లక్షల ఆదాయం



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి రూ.45,51,136 ఆదాయం లభించిందని ఈవో ఏ. రామకోటిరెడ్డి తెలిపారు. స్వామి దిగువ సన్నిధి, ఎగువ సన్నిధిలతో పాటు ఘాట్ రోడ్డుపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించినట్లు పేర్కొన్నారు. ఎగువ సన్నిధిలో రూ. 18,90,274, దిగువ సన్నిధిలో రూ. 25,30,803, వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 85,800తో పాటు అన్నదానానికి రూ. 44,259 సమకూరినట్లు తెలిపారు.గత మూడు నెలల కంటే ప్రస్తుతం రూ. 29,259 అదనంగా వచ్చినట్లు చెప్పారు.

ప్రకాశం బ్యారేజ్ దిగువకు నీరు విడుదల

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజీకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం సాయంత్రం గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. 61,072 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకు వచ్చి చేరనున్నదని ,దిగువకు 57,500క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని అధికారులు చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



సూచనలు ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్న నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఎస్‌ఆర్‌కేటీ గేటు నుంచి చిలుకలూరిపేట హైవే వరకు సదరు ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి, పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. చిలకలూరిపేట నియోజక వర్గంలో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే ప్రాంతాలైన పట్టణంలోని ఏఎంజీ చెక్ పోస్టు, ఆర్టీసీ బస్టాండ్ అడ్డరోడ్డు, కొండ్రుపాడు, నరసరావుపేట సెంటర్, పసుమర్రు, కావూరు, లింగంగుంట్ల, బొప్పూడి గ్రామాల సమీపంలోని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడమే అన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐలను ఆదేశించారు. మద్యం తాగి నడిపే వారిపై కఠిన ర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ శివారు పరిధిలో అతివేగంగా వాహనాలు నడపకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బాల, బాలికలు వాహనాలు నడిపితే కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. వారు రాత్రి సమయాల్లో అనవసరంగా బైకులు మీద తిరగకుండా పటిష్టచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్బీ సీఐ బండారు సురేష్‌బాబు, చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్‌బాబు, రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, రూరల్ ఎస్ఐ పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారికి రూ.15.81 లక్షల ఆదాయం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీలను గురువారం కార్యనిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులు లెక్కించారు. మొత్తం రూ. 15,81,924 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో రూ.12,10,467 మాత్రమే వచ్చిందని, ప్రస్తుతం రూ. 3,71,457 అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రంగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ , 6వ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సీఈ ఎ. శివప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు నవంబర్ 2వ తేదీలోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్ : జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబును నియమిస్తూ గురువారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రావణ్‌బాబు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా ఫారెన్ సర్వీసులో మూడేళ్ల నుంచి పని చేస్తున్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ సుబ్బరాజు ఇటీవల కాకినాడకు బదిలీ అయ్యారు.

అండర్-17 వాలీబాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ -17 బాలబాలికల వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు గురువారం జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి 450మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎం. రవి, బాపట్ల జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ కరీముల్లాతో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. స్థానిక పీఈటీ వెంకటేశ్వరరావు ఎంపికలను పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20న హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు దుస్తులను గ్రామ పెద్దలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిద్రమాత్రలు మింగి వైద్యాధికారి ఆత్మహత్యాయత్నం

ఈపూరు: ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కమలాకర్ బుధవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పని ఒత్తిడి, ఆసుపత్రిలోని సిబ్బంది తన మాట వినడం లేదనే కారణంతోను తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆయన అన్నట్లు తెలిసింది. అదేవిధంగా తాను ఎవరివల్ల ఇబ్బంది పడుతున్నాడో ఒక పేపరు మీద రాసి తన విశ్రాంతి గదిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సిబ్బంది పిలవడానికి వెళ్లి వైద్యుడు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి డాక్టర్లు, ఇతర సిబ్బంది సాయంతో ఆసుపత్రికి చేర్చారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

ముగిసిన చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మూడు రోజుల నుంచి రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నెక్స్‌జెన్ స్కూల్లో జరుగుతున్న లీలావతి మెమోరియల్ ఏపీ అండర్-15 బాలబాలికల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకుడు వై.వి.కె. చక్రవర్తి మాట్లాడుతూ బాలురల్లో ఎస్.వై.ఎస్. గంగాధర్, కె.భవన్, ఎం.వి. రుత్విక్, కె.సీతాసాగర్, బాలికల్లో వి.త్రిపురాంతిక, ఏ.ఎన్.ఎస్.ఎస్. దివ్య, జి.హిమతేజస్విని, ఎన్.రిషితలు వరుస స్థానాలు గెలుపొందారని తెలిపారు.

యార్డుకు 51,885 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 51,885 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,582 అమ్మకాలు జరిగాయి.

ఏఎన్‌యూలో క్రీడల సందడి

- సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- తొలిరోజు ప్రతిభ కనబరిచిన ఏపీ అథ్లెట్లు
- పలు అంశాల్లో బంగారు పతకాలు కైవసం





వివిధ విభాగాల్లో పోటీ పడుతున్న అథ్లెట్లు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన గురువారం పలు అథ్లెటిక్స్ అంశాల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మరికొంతమంది ఏపీ అథ్లెట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. పలు అథ్లెటిక్స్ అంశాల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన అథ్లెట్ల వివరాలు వరుసగా....

అండర్-20 కేటగిరి

పురుషుల విభాగం 100 మీటర్ల పరుగులో షేక్ రోషన్(ఏపీ), రితిక్ (తమిళనాడు), మార్క్ ఆంథోనీ డి కోస్టా(కర్నాటక). పురుషుల 1500 మీటర్ల పరుగులో కాత్రావత్ శ్రీను (తెలంగాణ), కురుబా మహేంద్ర(ఆంధ్రప్రదేశ్), కృష్ణ రాథోడ్(కర్నాటక). పురుషుల 5000 మీటర్ల నడకలో విజయ్ సావరత్కర్(కర్నాటక), సుగుమార్ ఎస్ (తమిళనాడు), హరీష్ ముల్లు(ఆంధ్రప్రదేశ్) ఉన్నారు.

- పురుషుల లాంగ్‌జంలో సుషాన్ జి సువమ (కర్నాటక), హరిహరణ్ ఆర్ (తమిళనాడు), లోహియా టి (కర్నాటక). పురుషుల హేమర్ త్రో(6కేజీలు)లో గణేష్ కన్న(తమిళనాడు), అవినాష్(కర్నాటక), వెంకటేష్ నీలమత్రి(తెలంగాణ) ఉన్నారు.
- మహిళల విభాగం 100 మీటర్ల పరుగులో శ్రీ నారాయణన్ కుట్టి(కేరళ), పర్తిప సెల్వరాజ్(తమిళనాడు), గుణ శ్రీ ఎం (తమిళనాడు).
- మహిళల విభాగం 5000 మీటర్ల నడకలో గీతాంజలి ఏ (తమిళనాడు), సీమా నంద్యాల్కర్(కర్నాటక), ప్రియదర్శిని ఎంకే (తమిళనాడు). మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో షైనీ గ్లాడిస్సియా (తమిళనాడు), మగుదీశ్వరి శివకుర్ (తమిళనాడు), అపూర్వా నాయక్ (కర్నాటక), షాట్‌పుట్‌లో చహానా రామన్(తమిళనాడు), మాధుర్య(కర్నాటక), రేయా ఎస్‌కే(కర్నాటక) ఉన్నారు.

అండర్-18 కేటగిరి

బాలుర విభాగం 100 మీటర్ల పరుగులో ఛిరాస్త్ పి(కర్నాటక), ముదావిత్ గణేష్(తెలంగాణ), శేషు దుడ్డు(ఏపీ) ఉన్నారు.

- పురుషుల హైజంప్‌లో అంబ్రీష్ కె(తమిళనాడు), సినాన్(కర్నాటక). పురుషుల షాట్‌పుట్ (5 కేజీల)లో అనురాగ్(కర్నాటక), ఎస్ పద్మ తేజస్(తమిళనాడు), సుభాష్ హెచ్‌ఎస్(కర్నాటక).
- పురుషుల జావాలిన్ త్రోలో ఎస్. ప్రదీప్(తమిళనాడు), ధరణీధరన్ టి(తమిళనాడు), సుభమ్ సురేష్ కున్దేకర్(కర్నాటక)
- బాలికల విభాగం 100 మీటర్ల పరుగులో స్తుతి శెట్టి(కర్నాటక), మధొమిధ(పుదుచ్చేరి), అనూషా జి నాయక్(కర్నాటక) ఉన్నారు.
- బాలికల 100 మీటర్ల హర్డిల్స్‌లో భవన జి(తమిళనాడు), ఐషా రెన్జిత్(కర్నాటక), అయిత్రోళ్ళ ప్రనతి(తెలంగాణ)
- బాలికల లాంగ్‌జంప్‌లో శ్రీహనీషా పి (తమిళనాడు), అన్నా రోసీ పాల్ (కేరళ), దివిజా భరద్వాజ్(కర్నాటక)
- బాలికల డిస్కస్‌త్రోలో అనుశ్రీ (తమిళనాడు), ఎస్ మెర్లిన్ జార్జ్(తమిళనాడు), తేజస్విని సి (కర్నాటక)

అండర్ – 16 కేటగిరి

బాలుర విభాగం 50 మీటర్ల పరుగులో ఆయుష్ ప్రన్‌జ్వాల్(కర్నాటక), అప్పాల వరుణ్(తెలంగాణ), చొక్కారి కిరణ్ సాయి(ఆంధ్రప్రదేశ్)

- లాంగ్ జంప్‌లో అన్షు యాదవ్(తెలంగాణా), ఉబీష్ రాగవ్ ఎస్(తమిళనాడు), యశ్వంత్ రాజు వేల్పుల(ఏపీ)
- బాలుర షాట్‌పుట్‌లో ప్రణీత్ కుమార్ బోగోజు (ఆంధ్రప్రదేశ్), నిఖిల్ (కర్నాటక), అఖిల్ కె(తమిళనాడు)
- బాలుర జావలిన్‌త్రోలో పుష్పక్ నెల్వాడే(కర్నాటక), నైని శ్రీకాంత్(తెలంగాణా), గోకుల్ బి(తమిళనాడు)
- బాలికల విభాగం 60 మీటర్ల పరుగులో డింపుల్ మహాశ్రీ లక్కోజు(ఆంధ్రప్రదేశ్), టి భ్రుతిక(తమిళనాడు), నిదీక్షా నాయక్(కర్నాటక)
- 80 మీటర్ల హర్డిల్స్‌లో నిరూపా హోల్లా(కర్నాటక), అభినందన ఎస్(కేరళ), ఎంఎం జన్య బొల్లమ్మ(కర్నాటక)
- అండర్- 14 కేటగిరీ బాలికల విభాగంలో ట్రైయాథ్లాన్‌లో ఆర్తి ఎస్‌కే(తమిళనాడు), జైని నక్షత్ర(తెలంగాణ), అక్షయ ఎం(తమిళనాడు)

ఏపీని క్రీడా హబ్‌గా మార్చేందుకు చర్యలు

ఎంపీ కేశినేని శివనాథ్



ప్రారంభోత్సవ సభలో ఎంపీ కేశినేని శివనాథ్

ఏఎన్‌యూ: అథ్లెట్లు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి, తమ రాష్ట్రానికి కీర్తి తేవాలని ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను గురువారం సాయంత్రం ఎంపీ లాంఛనంగా ప్రాంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో అథ్లెట్లు ముందుకుసాలని సూచించారు. ఏపీని క్రీడా హబ్‌గా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రసంగిస్తూ క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారాలు అందిస్తామని తెలిపారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఏపీఏఏ కార్యదర్శి గౌతమ్ కిరణ్, ఏపీ అథ్లెటిక్స్ కోచ్ ప్రసాద రెడ్డి, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ ప్రసంగించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.హనుమంతురావు, వెనుక ముసుగులో నిందితులు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని రంగాకాలనీలో మహిళపై హత్యాయత్నానికి యత్నించిన ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ ఎం.హనుమంతురావు గురువారం తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. రంగాకాలనీలోని 16వ లైనులో నివాసముంటున్న రావినూతల కరుణ కుమార్తె భారతి భర్తతో పలు కారణాలతో పుట్టింట్లో ఉంటోంది. ఈక్రమంలో 17వ వార్డుకు చెందిన పి.పూర్ణచంద్రరావుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారతిని శారీరకంగా హింసిస్తుండటంతో తన చిన్న కుమార్తెను తీసుకొని భారతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే భారతి ఎక్కడికి వెళ్లిందో తల్లి రావినూతల కరుణకు తెలుసనే ఉద్దేశంతో పూర్ణచంద్రరావు, మరో నిందితుడు పల్లపు అంకమ్మరావుతో కలిసి వారి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. భారతి ఆచూకీ కావాలనే దాస్తుందనే ఉద్దేశంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో కరుణను విచక్షణారహితంగా పొడవటంతో పెద్దగా కేకలు వేసింది. కరుణ చిన్నల్లుడు, చిన్న కూతురు, పక్కనే ఉన్న గృహాలు వారు వచ్చేసరికి పూర్ణచంద్రరావు కత్తిని చూపిస్తూ అందరినీ బెదిరిస్తూ అంకమ్మరావుకు చెందిన బైక్‌పై పారిపోయాడు. గాయపడ్డ కరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తితో పాటుగా ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడు

జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: కుటుంబం, మానవతా విలువలు ప్రతిబింబించే విధంగా రామాయణ మహాకావ్యాన్ని రచించి సమాజానికి అందించిన మహాపుణ్యకవి వాల్మీకి మహర్షి ఆదర్శనీయుడని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణమని, అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచేవిధంగా సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకిగా కొనియాడారు. ఆయన ప్రబోధించిన ఆశయాలు, పవిత్రమైన ఆలోచనలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ, స్వార్థచింతనను విడనాడి సన్మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ చేసిన ఉద్యోగులు, కార్మికులు
- నరసరావుపేటలో కొనసాగిన రిలేదీక్షల శిబిరం



గుంటూరు రోడ్డులో ఎమ్మెల్యే చదలవాడ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో విధుల్లో నుంచి తొలిగించిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయనాయక్ డిమాండ్ చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత 15రోజుల నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు గురువారం గుంటూరురోడ్డులోని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ముందు కొద్దిసేపు ఆందోళన చేసి నినాదాలు చేశారు. శిబిరాన్ని ఉద్దేశించి ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఒక్క ఫోన్‌కాల్ ఎమ్మెల్యే నుంచి చేయిస్తే విధుల్లోకి తీసుకుంటానని మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారని, ఆయన కార్మికుల కోసం పనిచేస్తున్నారా, ఎమ్మెల్యే కోసం పనిచేస్తూ జీతం తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాల్మన్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జేసీ ఇసుక రీచ్‌ల పరిశీలన



అంబడిపూడి రీచ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

అచ్చంపేట: మండలంలో నాలుగు ఇసుక రీచ్‌లు మంజూరై పెండింగ్‌లో ఉండగా గురువారం పల్నాడు జిల్లా జాయింట్‌కలెక్టర్ గనోరె సూరజ్ ధనుంజయ్, సత్తెనపల్లి ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డిలు పరిశీలించారు. మంజూరైన అంబడిపూడి 1,2,3, కోనూరు రీచ్‌ల పరిస్థితి, నదిలో నుంచి ఇసుకను డంప్ చేసేందుకు మంజూరైన పట్టాభూమికి అనువైనా దారి, డంప్‌చేసే ప్రదేశం, డంప్ చేసిన ప్రాంతం నుంచి వినియోగదారులకు ఏ విధంగా సరఫా చేస్తారు, వచ్చే లారీలు వెళ్లడానికి ఉన్నదారులు, వాటి పరిస్థితి, వినియోగదారులకు ఇసుకను ఎలా సంఫరా చేస్తారు తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దీనిపై స్థానిక తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్‌తో చర్చించారు. ఇవికాకుండా మరి కొన్ని ఇసక రీచ్‌లను అనుమతులివ్వడానికి ఆమోదకరమైన రీచ్‌లున్నాయా అనే విషయాలపై దృష్టి సారించారు. కస్తల, చామర్రు, గింజుపల్లి తదితర రీచ్‌లను కూడా పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జేసీ వెంట డిప్యూటీ తహసీల్దార్ జానీబాషా, వీఆర్వోలు, మండల సర్వేయరు తదితరులున్నారు.

సెపక్‌తక్రా జిల్లా జట్టు ఎంపిక



జిల్లా సెపక్‌తక్రా జట్టుతో అసోసియేషన్ సభ్యులు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి పల్నాడు జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక గురువారం జరిగింది. జిల్లా జట్టుకు ఎంపికైనవారు శ్రీకాకుళం జిల్లాలో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, కార్యదర్శి పి.శివరామకృష్ణలు తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలో పాఠశాల హెచ్‌ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రావిపాటి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్తనాయక్, కె.శివనాగశశికళ, కె.సునీతలు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై కేబుల్ వర్కర్ మృతి

కారెంపూడి: విద్యుత్‌షాక్‌కు గురై కేబుల్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలోని బట్టువారిపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. దాచేపల్లి గ్రామానికి చెందిన జాలె నాగేశ్వరరావు బట్టువారిపల్లె గ్రామంలో కేబుల్ లైన్‌లాగే క్రమంలో కరెంటు స్తంభాలకు కేబుల్ వైరు కడుతుండగా ప్రమాదం జరిగింది. నిచ్చెన వేసుకుని కేబుల్ వైరును కరెంటు స్తంభానికి కడుతుండగా నిచ్చెనకు తడిఉండడం వల్ల అది విద్యుత్తు తీగలకు తగలడంతో విద్యుత్తు ప్రసారం జరిగి మొదట షాక్‌కు గురై ఆ తర్వాత పక్కనే సప్లయ్ ఉన్న ఎల్‌టీ లైన్‌పై పడి విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడని తెలుస్తోంది. వెంటనే పెదకొదమగుండ్లలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే నాగేశ్వరరావు (40)మృతి చెందాడని డాక్టర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారెంపూడి ఎస్ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూరవిద్య ప్రవేశాలకు 25తో ముగుస్తున్న గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి దూర విద్య టెన్త్, ఇంటర్‌లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశం పొందేందుకు తుది గడువు ఈనెల 25న ముగియనుందని సంస్థ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు రూ.200, 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళ బ్యాగులో బంగారు ఆభరణాలు మాయం

నరసరావుపేట టౌన్: మహిళా బ్యాగులో బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ గురువారం సాయంత్రం తెలిపారు. గుంటూరుకు చెందిన పానుగోటి సంజన శ్రీలక్ష్మి దసరా పండుగ రోజు రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలోని అత్తగారి ఇంటికి వచ్చింది. రెండు రోజుల క్రితం పట్టణంలోని బృందావనం జ్యువెలర్స్ వద్దకు వచ్చి తనవద్ద ఉన్న పాత వెండి వస్తువులను మార్చి కొత్తవి తీసుకుంది. వాటితోపాటు తన వద్ద ఉన్న బంగారు వస్తువులు బ్యాగులో భద్రపరుచుకుంది. అక్కడ నుంచి బట్టలషాపు వద్దకు వెళ్లి చూడగా బ్యాగులో బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. సుమారు 74 గ్రాముల బంగారం అపహరణకు గురైందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేవస్థానం భూముల్లో ప్రభుత్వ భవనాలు

పరిశీలించిన దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి



మాట్లాడుతున్న దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానానికి చెందిన భూములలో ప్రభుత్వ భవనాలు నిర్మించినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, సత్తెనపల్లి వి.లీలావతి తెలిపారు. గ్రామానికి చెందిన దీకొండ అచ్చయ్య సీతారామస్వామి దేవస్థానం భూములలో ప్రభుత్వ భవనాలు నిర్మించినట్లు జిల్లా దేవదాయశాఖ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె గురువారం గ్రామాన్ని సందర్శించి ఆయా భవనాలు ఎక్కడ నిర్మించారో పరిశీలించారు. సర్వే నంబర్ 203లో ఈ భవనాలను నిర్మించినట్లు గుర్తించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట మండల ఎండోమెంట్ అధికారి గాదె రామిరెడ్డి ఉన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మృతుడు వెంకటేశ్వర్లు నాయక్

అచ్చంపేట: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండూరులో గురువారం చోటుచేసుకుంది. మృతుని భార్య కేటావతు అంజమ్మభాయ్ అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఇలా ఉంది.. పల్నాడు జిల్లా కొండూరు గ్రామానికి చెందిన కేతావతు వెంకటేశ్వర్లునాయక్(44) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం నుంచి వెతకడం ప్రారంభించారు. పొలంలోకి వెళ్లి చూడగా చనిపోయి ఉండడాన్ని గమనించారు. పక్కనే పురుగుమందు బాటిల్ ఉండగా, పురుగుమందు తాగి మృతి చెందినట్లుగా పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా పంటలు సక్రమంగా పండటం లేదన్నారు. తమకున్న సొంత పొలం రెండెకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశారు. ఈ యేడాది కూడా పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, పెట్టుబడులు భారీగా పెరిగిపోవడంతో అప్పులవాళ్లకు సమాధానం చెప్పలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకులలో, ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో, తెలిసిన వాళ్ల వద్ద చేబదులుగా తీసుకున్న అప్పులు రూ.12 లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. మృతినికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఘటనపై అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.